# దైన్యము

కథకుడు

"విశ్వకర్మ."

మొన్న మధ్య ఒకనాడు మధ్యాహ్నం రెండుగంటల సమయంలో గోల్డెన్ కెఫేకుతె ఆంధ్రపత్రిక చదువుకొని వస్తున్నా. పత్రికలో చదివిన నాగేశ్వరరావుగారి ప్రశంసలు గుణకీర్తనలు. హృదయం అంతా నిండిపోయి వున్నవి. పెద్ద బజారు గడచి ప్రక్క సందులో ప్రవేశించేటప్పటికి విస్తరాకుల్లో ప్రకీర్ణంగా పడవేసిఉన్న కూరలు సర్దుకుంటూవున్న మేఘశ్యామల మూర్తి ఒకడు సాక్షాత్కరించాడు. వాడి ప్రక్కనే ఇంకో వ్యక్తి- పొట్టచర్మం పేగులకు అతుక్కుపోయి ఉన్నది- ఆతురతతో క్రమం లేకుండా చేతికందిన పదార్థాల్ని అందినట్లే నోట కుక్కుకుంటున్నాడు. తీరా పరికించి చూస్తే వాళ్ళచుట్టూ ఉన్నవి ఎంగిలాకులు మహారాజులయిన ధనికుల భుక్త శేషంతో వీళ్ల కడుపు చిచ్చులు చల్లారుతున్నట్టు కనబడ్డది. బస్తీ పక్క ఏ చెట్టు నీడనో, పుట్టనీడనో కాపురాలు చేసే వీళ్ల కుటుంబాలకు రోజూ పట్నంలో జరిగే శుభాశుభ కార్యాలను వెతుక్కోటం వృత్తి. ఆదరించిచే కూలిపనైనా ఇచ్చేవాళ్లు లేరు కాబోలు!

అదివరకు అమితోత్సాహంతోను, ఆనందంతోను నిండుకొని ఉన్న నామనసు అప్పుడు ఎలా అయిపోయిందో చెప్పలేను. ఈశ్వర సృష్టిలో ఒకప్రక్క ఆనంద సౌఖ్యం, ఒక ప్రక్క విషాదం, కష్టం, ఎలా తాండవిస్తున్నవిరా! అనిపించింది. ఇటు చూస్తే సుందర హర్మ్యాల్లో దివ్య సౌఖ్యాల్ని అనుభవిస్తూ దీనులంటేను, బీదలంటేను, చీరికగొనక మహా గర్వంతో సంచరించే కుబేరులు. అటు చూస్తే మూడురోజులకొక పూటైనా తిండి దొరకక దరిద్రం కరుడు కట్టుకొన్నట్టు—పలవిస్తూ కనపడే నిరుపేదల తండా! ఇదంతా దేవుడికి యిష్టమేనా, లేక మానవులు చేసే అన్యాయమా? దేవుడు, దేవుడి యిష్టం ఎలా ఉన్నా ఆలోచించి చూస్తే మనుష్యులు చేసే అన్యాయమే అనిపిస్తుంది. జనులంతా పూనుకుని కృషిచేసి వాళ్ళ దుర్భిక్షాన్ని ఎందుకు పోగొట్టకూడదు? వాళ్ళ ఇనప్పెట్టెల్లో బడి మూలిగే డబ్బంతా అలాంటివాళ్ల ప్రాణాలకు ఆధారమయితే దేశం ఎంత కల్యాణంగా ఉంటుంది. లేకపోతే చివరికి భాగ్యవంతుల ఇన్‌కంటాక్సుకు సరిపడినంత డబ్బయినా ఇది గూడా దేవుడూ, ప్రజా, మెచ్చే ఒక టాక్సు అని దీనసేవకు వినియోగిస్తే బాగుండదా అనిపించింది.

కూకటివేళ్లతో పాడుకొన్న ఈ ఎంగిలి కూళ్ల కడుపు ఎప్పుడు ప్రారంభమయిందో కాని నాకు ఆ దృశ్యం చూడగానే గుండెలు పగిలిపోయినయి. ఒకడు తిని మిగిల్చిన ఎంగిలికూడు ఇంకోసాటిసోదరుడు మహా ప్రసాదంలాగ తింటమా? భరతమాత బిడ్డలలోనా ఇలాంటి అన్యాయమూ, అత్యాచారమూను. ఆకలి అర్చుకోలేక తిండిలేక అల్లాడే పేదజీవులు ఎంతమందో భాగ్య భారతంలో. సిగ్గు, సిగ్గు. ఇంకా ధనవంతులు సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ఆమోదించకూడదా? సమానత్వానికి పాటుబడకూడదా? వాకిట్లో క్షుద్బాధతో ప్రాణాలు బిగబట్టుకొని ఏడ్చే దీన జనము సుందర భవనంలో షడ్రసోపేతంగా విందులారగించే భాగ్యవంతులు. దీనికి అంతరాత్మ ఒప్పుకొంటుందా? దేశమాతా! అలాంటి పేదజీవులకు పట్టుమని పట్టెడన్నం కలిగేరోజులు తెప్పించరాదూ! నీ కుమాళ్ళ దుండగాల్ని ఇంకా ఎన్నాళ్లుహర్షిస్తావు?

ఈ భావాలన్నీ రైలు ఇంజను చక్రంలాగ గిఱ్ఱున తిరిగిపోయాయి హృదయంలో. ఏమీ తోచలేదు. ఇంటికివచ్చి మంచానికి అడ్డంగా పడుకున్నా. హృదయం వేదనాభరంతో క్రుంగిపోతూన్నది. టేబిలు వంకచూస్తే చిత్రగుప్తుడు ఆ మనోవేదనంతా బుక్కుచేసుకో మన్నాడు. నిద్రపట్టింది.